అతిథిపై నిఘా నేత్రం

- నగరంలో విస్తృతంగా లాడ్జీల తనిఖీలు
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న అతిథులు
- వ్యాపారంపై ప్రభావం పడుతుందన్న యజమానులు
- సమాజ శ్రేయస్సు కోసమే అంటున్న పోలీసులు


నగరంలోని ఓ లాడ్జీలో బ్యాగ్ తనిఖీ చేస్తున్న పోలీసులు


అతిథి గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం:
- కాకినాడ మెయిన్ రోడ్‌లోని ఓ హోటల్‌లో నెల్లూరుకి చెందిన భార్యాభర్తలు కొద్ది రోజులుగా ఉంటున్నారు. ఇటీవల ఆ హోటల్‌లో సాధారణ ప్రక్రియలో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ విషయంపై అవగాహన లేని ఆ దంపతులు, యాజమాన్యంతో పోలీసు తనిఖీలపై గొడవ పడ్డారు.
- భానుగుడి కూడలిలోని హోటల్‌లో పిఠాపురానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి వ్యక్తిగత కారణాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడగా యాజమాన్యం అనేక పర్యవసానాలు ఎదుర్కొంది.
- మసీదు సెంటర్‌లోని లాడ్జీలో ఓ ఫార్మా కంపెనీ ఏరియా మేనేజర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.

ఇలా లాడ్జీల చుట్టూ అలుముకుంటున్న వివాదాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో లాడ్జీలకు వచ్చే అతిథుల్లో ఆందోళన నెలకొంది. శాంతిభద్రతల పర్యవేక్షణ పేరుతో పోలీసులు తనిఖీలు చేపట్టడం చర్చనీయాంశమవుతోంది. తరచూ తనిఖీలతో అతిథుల నుంచి లాడ్జీల యాజమాన్యాల వరకు గందరగోళానికి గురవుతున్నారు. అభద్రత భావంతో అతిథులు ఇబ్బందులు పడుతుంటే, వ్యాపార కార్యకలాపాలపై ప్రభావం పడుతోందని యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. శాంతిభద్రతల విషయంలో రాజీ ప్రసక్తే లేదంటూ పోలీసులు చెబుతుండగా, అసలు లాడ్జీల్లో గదులు తీసుకునే అంశంపై అతిథులు అనుసరించాల్సిన విధానం, పోలీసుల నిబంధనలపై నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.

లాడ్జీ తనిఖీలు ఎందుకు..?

ఎందుకు లాడ్జీల్లో తనిఖీలు చేస్తున్నారనే అంశంపై పోలీసులు స్పష్టత ఇస్తున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణే పరమావధిగా చెబుతున్నారు. సాధారణ రోజులతో పాటు, పలు ప్రత్యేక సందర్భాల్లో ఈ తనిఖీలు ముమ్మరంగా చేపడుతుంటారు. పొరుగు ప్రాంత ఇంటెలిజెన్స్ లేదా పోలీస్ వర్గాల నుంచి అందే నేరస్తుల సమాచారం మేరకు, స్థానిక నేరస్తుల జాడ కోసం తనిఖీలు చేస్తారు. అక్రమ కార్యకలాపాల నివారణే లక్ష్యంగా ఈ తనిఖీలు జరుగుతుంటాయి. సమాజ, దేశ భద్రత ప్రధాన కారణంగా కూడా నివాస సముదాయాలైన లాడ్జీలు, హోటళ్లలో పోలీసులు తనిఖీలు చేస్తారు.

కారణాలు ఇవే..

జూదం, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, వ్యభిచారం, ఆయుధాల రవాణా, విదేశీ వ్యక్తుల గుర్తింపు, అనుమానిత వ్యక్తుల సంచారం, విదేశీయులపై నిఘా, నేరస్తులు తలదాచుకోవడం, ఉగ్రవాద, సంఘ విద్రోహ శక్తుల ఉనికి, భద్రత కల్పించాల్సిన ప్రత్యేక దినాలు, వీవీఐపీల సందర్శన వంటి కారణాల నేపథ్యంలో లాడ్జీలు, వసతి సముదాయాల్లో తనిఖీలు చేపడతారు.

ఒకే గదిలో ఉండొచ్చు..

18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు పరస్పర సమ్మతితో హోటల్ లేదా లాడ్జీలో ఒకే గదిలో ఉండొచ్చు. వారికి పెళ్లయి ఉండాలన్న నిబంధన భారతీయ చట్టాల్లో ఎక్కడా లేదు. వారి ఐడీ ప్రూఫ్‌లు మాత్రం కచ్చితంగా నమోదు కావాలి. హోటల్ నిబంధనలు అనుసరించి కనీసం ఒకరిది లేదా కలిసి ఉండే ఇద్దరిదీ గుర్తింపు కార్డులు అడిగే అవకాశం ఉంది. గుర్తింపు కార్డులో ఒకే చిరునామా, ఒకే ఇంటి పేరు ఉండి తీరాలన్న నిబంధన లేదు. పోలీసులు తనిఖీలకు వచ్చినా, తాము మేజర్లమని ఐడీ ప్రూఫ్ చూపించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగే, సమాజానికి హాని చేకూర్చే ఎటువంటి కార్యకలాపాల కోసం తాము ఇక్కడ లేమని స్పష్టం చేయాలి. ప్రత్యేక, అత్యవసర పరిస్థితుల్లో తప్ప మరెప్పుడైనా పోలీసులు సెర్చ్ వారెంట్‌తోనే గది లేదా సామగ్రి తనిఖీలు చేపట్టాలి. గదిలో మహిళలున్నారని గుర్తిస్తే, కచ్చితంగా మహిళా పోలీసులే తనిఖీలు చేపట్టాలి.

అతిథులు ఏమంటున్నారంటే..

ఎంతో కచ్చితంగా ఉంటున్నా పోలీసుల తనిఖీలు అసౌకర్యం కలిగిస్తాయి. చట్టంపై అవగాహన లేని జంటలే లక్ష్యంగా కొందరు కింది స్థాయి పోలీసు సిబ్బంది డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేసిన సందర్భాలు లేకపోలేదు. కొందరు పోలీసులు ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడారని ఓ సంస్థలో ఆడిట్ తనిఖీలకు హైదరాబాద్ నుంచి కాకినాడకు హాజరైన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. దంపతులమని చెప్పినా, తగిన ఆధారాలు చూపినా ఇబ్బందిగా ప్రవర్తించారంటూ ఓ జంట వాపోయింది.

యాజమానుల ఆవేదన ఇదీ..

లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేసే పోలీసులకు అన్ని విధాలా సహకరిస్తున్నామని యజమానులు అంటున్నారు. తరచూ తనిఖీలు చేపడితే అతిథులు అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దీని ప్రభావం వ్యాపారంపై పడుతోందంటున్నారు. పోలీసుల నిబంధనలను అనుసరించి అతిథుల నుంచి ఐడీ ప్రూఫ్‌లను సేకరిస్తున్నామని చెబుతున్నారు.

ప్రజా శ్రేయస్సు కోసమే..



లాడ్జీల్లో ఇటీవల నిర్వహిస్తున్న వరుస తనిఖీలు ప్రజా శ్రేయస్సు, విజిబుల్ పోలీసింగ్ కోసమే. రాష్ట్ర స్థాయి ఉన్నతవర్గాల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు ముమ్మరం చేశాం. గంజాయి నిందితులు, పాత నేరస్తుల కదలికలపై నిఘాయే ఈ తనిఖీలకు మూలం. 18 ఏళ్లు నిండిన వారు పరస్పర సమ్మతితో కలిసి ఉండొచ్చు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణకు కాదన్న విషయాన్ని పరిశీలనలో స్పష్టం చేయాలి. అనుమానితుల జాడ, విదేశీయుల ఉనికి, దేశ సరిహద్దుల్లో కమ్ముకున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో ఇటీవల కాలంలో లోతైన తనిఖీలు చేపడుతున్నాం. పలు లాడ్జీల్లో దిగుతున్న వ్యక్తులు ఆత్మహత్యలకు పాల్పడడం, అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వంటి అంశాలను సీరియస్‌గా పరిగణించి తనిఖీల్లో రాజీ పడకుండా వ్యవహరిస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, వివరాల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొందరు కాకినాడ లాడ్జీల యజమానులకు నోటీసులు ఇచ్చాం.

– దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఎస్పీ, కాకినాడ

క్లుప్తంగా

టెన్త్ టాపర్లకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బాలాజీచెరువు: మహాత్మాగాంధీ ప్రాథమికోన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారిని ఎస్‌బీఐ ట్రెజరీ శాఖ బుధవారం సత్కరించింది. విద్యార్థులు ఎం.విష్ణుప్రియ(580), ఎం.విస్సు(579), టీబీవీ రామచరణ్‌ను బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్యామల, ఉద్యోగులు కలిసి సత్కరించారు. కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా మార్కులు సాధించి ప్రతిభ చాటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్భుత వైద్య విధానం రూట్ కెనాల్


శ్రీవల్లీని సత్కరిస్తున్న డాక్టర్ అడ్డాల

బోట్‌క్లబ్: దంతాలకు రూట్ కెనాల్ వైద్య విధానం బాధాకరమైనది కాదని ప్రముఖ ఎండోడాంటిస్ట్ శ్రీవల్లీ అన్నారు. జాతీయ రూట్ కెనాల్ అప్రిసియేషన్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సత్య దంత వైద్యశాలలో రూట్ కెనాల్ వైద్యంపై అవగాహన కల్పించారు. రూట్ కెనాల్ ఇన్ఫెక్షన్, క్షయం వల్ల కలిగే తీవ్రమైన పంటి నొప్పిని తగ్గిస్తుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, రూట్ కెనాల్ చికిత్స పిప్పి సోకిన, తీవ్రంగా దెబ్బతిన్న పంటిని కాపాడుతుందన్నారు. దంతాలు తీసివేయకుండా కాపాడుకునే అద్భుతమైన వైద్య విధానమై రూట్ కెనాల్ అన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీవల్లీని సత్కరించారు.

'యంగ్‌మైండ్' సేవలు అభినందనీయం


జాహ్నవిని కలిసిన ఆర్‌జేడీ నాగమణి

బాలాజీచెరువు: ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి జాహ్నవికి యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ చేసిన సేవలు అభినందనీయమని విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి అన్నారు. ఇటీవల జాహ్నవి దాదాపు 80 శాతం శరీరం కాలిపోగా, యంగ్‌మైండ్ సంస్థ, దాతలు కలిసి ఆర్థిక సాయం చేసి, వైద్య ఖర్చులు భరించారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడి, కోలుకోవడంతో హాస్పిటల్ వైద్య సిబ్బంది, సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ కలిసి బాలిక తిరిగి పాఠశాలకు వెళ్లేలా కృషి చేశారు. ఈ సందర్భంగా బుధవారం డెల్టా వైద్యశాలలో జాహ్నవిని ఆర్‌జేడీ కలిశారు.

బోట్ల తయారీ కేంద్రం మూసి వేయాలి


అమీనాబాదులో బోట్ల తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు సెంటర్ సమీపంలోని ఉన్న బోట్లు తయారీ కేంద్రాన్ని మూసివేయాలని పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోట్ల తయారీ కేంద్రం గ్రామం మధ్యలో ఉండడం వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇటీవల బోట్ల తయారీ కేంద్రం నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు గ్రామానికి దగ్గరగా ఉండడం వలన ఈ కేంద్రాన్ని మూసివేయాలని కేంద్రం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్	: శుభం, జింఖానా, కలియుగం 2064, హిట్ ది థర్డ్ కేస్
దేవీ మల్టీప్లెక్స్	: సింగిల్, 6 జర్నీ, సీఎం పెళ్లాం, మహాబలి, తుడరం
లక్ష్మి	: హిట్ ది థర్డ్ కేస్
సత్యగౌరి	: సింగిల్
తిరుమల	: శుభం
సీఅండ్‌సీ	: రెట్రో
సీఅండ్‌సీ–2	: హిట్ ది థర్డ్ కేస్
శ్రీప్రియ	: జగదేకవీరుడు అతిలోక సుందరి
పద్మప్రియ	: సింగిల్

సాయిప్రసన్నకుమార్‌కు కళాకిరీటి పురస్కారం


ప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

బాలాజీచెరువు: సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లి సాయిప్రసన్నకుమార్‌కు కళాకిరీటి పురస్కారం లభించింది. సాహితీవేత్తలు, కవులు, వివిధ రంగాల కళాకారులకు శ్రీశ్రీకళావేదిక సంస్థ ఏలూరులో మూడు రోజుల పాటు ప్రపంచ సాహితీ సంబరాలు నిర్వహించింది. తెలుగు సాహిత్య విభాగంలో కళాకిరీటి పురస్కారంతో సాయిప్రసన్నకుమార్‌ను సత్కరించారు.

బుద్ధ విగ్రహం తొలగింపు అప్రజాస్వామికం

కాకినాడ సిటీ: తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా భోగీరం గ్రామంలో దళితులు బుద్ధుని విగ్రహం ప్రతిష్ఠించుకుని పూజలు చేస్తున్న నేపథ్యంలో, అదే గ్రామానికి చెందిన ఆధిపత్య బహుజన కులాలకు చెందిన సుమారు 500 మందికి పైగా దళితులపై దాడులు చేసి విగ్రహాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అంబేడ్కర్ బుద్ధ విహార్ కాకినాడ అధ్యక్షుడు డాక్టర్ కె.బాబ్జీ తెలిపారు. బుధవారం కాకినాడలోని విహార్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో శాంతి ప్రదాత భగవాన్ బుద్ధుని జయంత్యుత్సవం జరుపుకొంటున్న సందర్భంగా భోగీరంలో బుద్ధుని విగ్రహం తొలగించడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం, మూర్ఖంగా రాళ్లతో దాడి చేసి అమాయక ప్రజలపై దౌర్జన్యం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో పాశవిక చర్య అని వ్యాఖ్యానించారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుని, దోషులపై కేసులు నమోదు చేయాలని కోరారు. దేశ సంస్కృతి, వారసత్వ సంపదైన బౌద్ధంపై దాడి చేయడమంటే రాజ్యాంగంపై దాడిగా భావించాలన్నారు. సమావేశంలో బౌద్ధ విహార్ నాయకులు వీవీ సత్యనారాయణమూర్తి, డాక్టర్ ఎం.పవన్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, నాయకులు డి.వెంకటరావు, కె.రామారావు, పి.రాంప్రసాద్, పీవీవీ సత్యనారాయణ, మౌర్య భీమారావు, రాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె

- రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ నేత శేషబాబ్జీ


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శేషబాబ్జీ

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అర్బన్ పీహెచ్‌సీ ఉద్యోగుల నాయకుడు జీవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్త సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏనాటికైనా రెగ్యులర్ చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈలోపు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమైనా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ల వల్ల కార్మిక సంఘాలకే ప్రాధాన్యం లేకుండా పోతుందన్నారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయన్నారు. నగరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్ల నాయకులు బి.శ్యామ్, ఎం.నాగేశ్వరరావు, మందపల్లి సూర్యప్రకాష్, కొల్లి శ్రీనివాస్, ఆర్.లక్ష్మీనారాయణ, ఎంవీ ప్రభాకరరావు, అనపర్తి ఏడుకొండలు, మలక వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనాలి

కరప: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులంతా పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్‌తో కలిసి, బుధవారం ఆయన నడకుదురు, పెనుగుదురు, గొర్రిపూడి గ్రామాల్లో పర్యటించారు. ఉపాధిహామీ పథకం కూలీలతో సమావేశమై సార్వత్రిక సమ్మె గురించి వివరించారు.

తిమ్మాపురంలో కార్డన్ అండ్ సెర్చ్


తిమ్మాపురం జగనన్న కాలనీలో మంగళవారం అర్ధరాత్రి మోహరించిన పోలీసులు


వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

– రికార్డుల్లేని 23 మోటార్ సైకిళ్ల స్వాధీనం

కాకినాడ రూరల్: శాంతిభద్రతల నేపథ్యంలో తిమ్మాపురం జగనన్న కాలనీలో మంగళవారం రాత్రి పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అర్ధరాత్రి ఇళ్లలో నిద్రిస్తున్న వారిని లేపి మరీ వారి వాహనాలు, వాటి పత్రాలను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి అనుమానితులు ఉన్నారేమోనని ఆరా తీశారు. పోలీసుల తీరు, కేసుల భయంతో స్థానికులు భీతిల్లిపోయారు. గ్రామాల్లో పేదల నివసించే కాలనీలో అర్ధరాత్రి రెండు గంటలకు పోలీసులు తనిఖీలు చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఇన్‌చార్జి ఎస్సై రాంబాబు, ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, గొల్లపాలెం ఎస్సై మోహన్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 23 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కరాటే పోటీల విజేతలకు అభినందనలు


తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు

కాకినాడ రూరల్: పిఠాపురంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్, క్యాడెట్ జూనియర్స్ పోటీలలో విజేతలుగా నిలిచిన బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శిక్షణ పొందిన చిన్నారులను బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం అభినందించింది. పోటీలలో అందుకున్న మెడళ్లు, ప్రశంసాపత్రాలను విజేతలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు, వైద్యుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ, చిన్నతనం నుంచి శారీరక వ్యాయామం చేయడం వల్ల దృఢంగా ఎదుగుతారన్నారు. కోచ్ సతీష్ మాట్లాడుతూ, తమ వద్ద శిక్షణ పొందిన చిన్నారులు 14 మంది స్వర్ణ, 13 మంది రజత, ఇద్దరు కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం 11 మంది నిందితులను కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు, 8 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఏలేరులో తగ్గుతున్న నీటి నిల్వలు


ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ఏలేరు జలశయంలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంత మాత్రంగా ఉండడంతో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. దిగువ ఆయకట్టుకు నీటి సరాఫరా తగ్గించారు. బుధవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 76.51 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 9.71 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువ ఆయకట్టు, పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి సరాఫరా నిలిపి వేశారు.

రాజకీయ పార్టీల నేతలతో ఈఆర్వో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో మల్లిబాబు

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్వో, కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హెల్దీ ఓటరు లిస్టు తయారీ, పోలింగ్ కేంద్రాల మార్పులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, సురేష్‌కుమార్, ఆర్ఐ భవాని, రాజకీయ పార్టీల నాయకులు రావూరి వెంకటేశ్వరరావు, అప్పారావు, లింగమయ్య, సాయిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా భావనారాయణుడి తెప్పోత్సవం


ముక్తికా సరస్సులో హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

కాకినాడ రూరల్: నారాయణ క్షేత్రం సర్పవరంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి అమ్మ వారితో స్వామివారు కన్నుల పండువగా జల విహారం చేశారు. ఆలయం ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ముక్తికా సరస్సులో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై రాజ్యలక్ష్మి, భావనారాయణ స్వామిని ఉంచి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తెప్పోత్సవాన్ని తిలకించారు.

రాఘవమ్మ చెరువును రక్షించండి


పెద్దాపురం మండలం ఆర్బీపట్నంలోని రాఘవమ్మ చెరువులో చేస్తున్న మట్టి తవ్వకాలు

- జోరుగా మట్టి తవ్వకాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

సామర్లకోట: పెద్దాపురం మండలం ఆర్‌బీపట్నం రెవెన్యూ పరిధిలోని 170 ఎకరాల రాఘవమ్మ చెరువును రక్షించాలని ఆర్‌బీ పట్నం–ఆర్‌బీ కొత్తూరు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువులో మట్టిని కొందరు అక్రమంగా తవ్వేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, అలాగే చెరువును నాశనం చేస్తున్నారని ఆర్‌బీ కొత్తూరు, ఆర్బీ పట్నం గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు చెరువును రక్షించాలని సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు కె.వెంకటేష్, ఎం.శ్రీనివాసరావు, పి.సురేష్, ప్రకాష్ తెలిపారు. రెండు గ్రామాల కూడలి ప్రదేశంలో ఉన్న ఈ చెరువు నీటిని ఉపయోగించి పలువురు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరువును చదును చేయడానికి, మట్టి తీయడానికి అనుమతి ఉందని, రైతుల పొలాలకు ఉచితంగా మట్టిని అందిస్తున్నామని చెబుతూ.. మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతుల పొలాలకు మట్టి కావాలని కోరితే వారు చెప్పినంత సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును ఇష్టానుసారంగా లోతుగా తవ్వేయడం వలన వర్షాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. నీటి కోసం పశువులు చెరువులోకి దిగితే గోతుల్లో పడి బయటకు వచ్చే అవకాశం లేదని తెలియజేస్తున్నారు. మట్టి మాఫియాకు చెక్ పెట్టి చెరువును రక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలను పరిశీలించిన రాష్ట్ర అధికారుల బృందం


వేట్లపాలెం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

సామర్లకోట: మండల పరిధిలోని ఎత్తి పోతల పథకాల నిర్వహణను రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థకు చెందిన అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఇటీవల ఎత్తిపోతల పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాలను సేకరించగా అనేక ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని తీర్మానాలు చేశారు. దీంతో నీటి పారుదల అభివృద్ధి సంస్థకు చెందిన అధికారులు బుధవారం వేట్లపాలెం, మేడపాడు, పీబీ దేవం ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. ఆయా పథకాలకు సంబంధించి పైపులైన్ల మార్పు, పంపుసెట్లు, మోటారు, ప్యానెల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు వంటి అంశాలను తనిఖీ చేసి, ఆయా పథకాలకు అవసరమైన పనులను గుర్తించారు. ఆయా ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగవుతున్న ఆయకట్టు వివరాలను సేకరించారు. వేట్లపాలెం ఎత్తిపోతల పథకం నుంచి పెద్దాపురం మండలం రాజభూపాలపట్నం రాగబొమ్మ చెరువుకు నీరు అందేలా పైపులు ఏర్పాటు చేయాలని ఎత్తిపోతల కార్యనిర్వాహక అధ్యక్షుడు వేగుళ్ల బాబ్జి ఆయకట్టు రైతులతో కలిసి అధికారుల బృందానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట్రావు, రాంబాబు, అసిస్టెంట్ ఇంజినీర్ సురేంద్ర, సాంకేతిక నిపుణుడు ప్రసాద్ పాల్గొన్నారు.